క్లుప్తంగా

కేంద్రీయ విద్యాలయానికి బస్సు సౌకర్యం



సిరిసిల్లలో బస్సును ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ ప్రకాశ్ రావు

తంగళ్లపల్లి: సిరిసిల్ల పట్టణంలో అద్దె భవనంలో కొనసాగిన కేంద్రీయ విద్యాలయాన్ని అధికారులు సోమవారం రాత్రి మండలంలోని పద్మనగర్ గ్రామంలో నిర్మించిన సొంత భవనంలోకి మార్చారు. మంగళవారం కేవీకి వెళ్లేందుకు విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాశ్‌రావు బస్సు సౌకర్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 180 మంది విద్యార్థులు సిరిసిల్ల నుంచి పద్మనగర్‌లోని కేవీకి వెళ్తారన్నారు. ప్రతీరోజు ఉదయం 7:30 గంటలకు కొత్త బస్టాండ్ నుంచి బస్సు ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వర్జిలాల్, కంట్రోలర్ రామ్ రెడ్డి, కార్గో డీఎం ఈ.శేఖర్ రావు, ఆర్టీసీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్డిల సంక్షేమానికి కృషిచేయాలి



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న కోరుట్లపేట గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట: రెడ్డిలసంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని కోరుట్లపేటలో మంగళవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రెడ్డి కులస్తుల విద్యార్థులు చదువుకునేందుకు హాస్టళ్లు నిర్మించాలని కోరారు. రెడ్డి సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత గ్రామానికి తొలసారి వచ్చిన కృష్ణారెడ్డిని సన్మానించారు.

ముదిరాజ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో సంఘం సభ్యులు

రుద్రంగి: మండల ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకన్నారు. అధ్యక్షుడిగా బోండ్ల సత్యం, ఉపాధ్యక్షుడిగా పాల నర్సయ్య, నేవూరి చిన్న నర్సయ్య, కార్యదర్శిగా దాసరి అశోక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి, సంఘం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత



అవగాహన కల్పిస్తున్న అధికారులు

చందుర్తి : మండలకేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక సారథి పొత్తూరు రాజు కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు ఎండతీవ్రతపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆట, పాటల ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాకారులు గడ్డం దేవయ్య, పూడూరు సంజీవ్, వంతుర్పుల ఝాన్సీ, లావణ్య, శ్రీలత, అనుముల శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గంజాయి, డ్రగ్స్ మత్తులో యువత బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని కోరుతూ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో తిమ్మాపూర్‌లో మంగళవారం అవగాహన కల్పించారు. సాంస్కృతిక సారథి ఎడమల శ్రీధర్‌రెడ్డి కళాబృందం ఆధ్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

లేగదూడ అందజేత



ఇల్లంతకుంట: గాలిపెల్లికి చెందిన కేశవేణి ఎల్లయ్య ఎద్దు మంగళవారం మృత్యువాత పడింది. దీంతో రైతు కన్నీరు పెట్టుకోవడం వాట్సాప్ వైరల్ అయింది. దాంతో స్పందించిన ఇల్లంతకుంట శ్రీకృష్ణ గోశాల ట్రస్ట్ సభ్యులు రైతుకు లేగదూడను మంగళవారం అందించారు. దీంతో ట్రస్టసభ్యులకు రైతు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ ట్రస్ట్ చైర్మన్ అయ్యన్న గారి హరికృష్ణ రెడ్డి, ఉపాధ్యక్షులు కూనబోయిన బాలరాజు, నార్ల రామకిషన్, దినేష్, బోనగిరి రాము, నర్సయ్య, కనకయ్య, తదితరులున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు

- పూర్తికాని తంగళ్లపల్లి – ముస్తాబాద్ మండలాలను కలిపే రోడ్డు నిర్మాణం
- నిధులున్నా నిలిచిన పనులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా ఇందిరానగర్- ముస్తాబాద్ రోడ్డు

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరానగర్ భరత్‌నగర్ గ్రామపంచాయతీ రోడ్డు నిర్మాణం కలగానే మిగిలింది. నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతులు లేవంటూ అధికారులు రోడ్డు పనులు అడ్డుకోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో గుంతలరోడ్డుపై రాకపోకలు సాగిస్తూ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలో సరిహద్దు గ్రామమైన ఇందిరానగర్ భరత్‌నగర్ గ్రామపంచాయతీ ముస్తాబాద్ మండలానికి శివారు గ్రామంగా ఉంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు మండలాల మధ్య రాకపోకలు సాగించేందుకు వీలుంటుంది. దీంతోపాటు దూరభారం తగ్గుతుంది.

అటవీశాఖ నుంచి అనుమతులు లేవని..

తంగళ్లపల్లి–ముస్తాబాద్ మండలాలను కలిపేందుకు దాంతోపాటు దూరభారం తగ్గించేందుకు రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆరేళ్లక్రితం ప్రణాళిక రూపొందించారు. రోడ్డు పనులు ప్రారంభించి కొంతమేర సగం తారురోడ్డు కూడా వేశారు. అయితే రోడ్డుమార్గం రిజర్వ్ ఫారెస్ట్ భూముల్లో నుంచి వెళ్తుండడంతో అటవీశాఖ అధికారులు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. అటవీశాఖ నుంచి అనుమతులు లేవని రోడ్డును నిలిపివేయాలని ఆదేశించడంతో చేసేదేమీ లేక రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాల్సి వచ్చింది.

సమన్వయలోపం.. ప్రయాణికులకు శాపం

రోడ్లు, రవాణా శాఖ, అటవీశాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో ఆరేళ్లుగా ఆమార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు, గ్రామస్తులకు శాపంగా మారింది. మట్టిరోడ్డు గుంతలమయమై ఉండడంతో ఆరోడ్డు వెంట ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా ఇందిరానగర్ భరత్‌నగర్ గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అత్యవసర సయమాల్లో రోగులను ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తిచేసి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఆరేళ్లుగా నిలిచిపోయాయి



నేను సర్పంచ్‌గా గెలిచిన మొదటి ఏడాదిలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. రోడ్డు తిప్పలు తప్పాయని అందరూ సంతోషపడ్డారు. అయితే ఆ ఆనందం ఎంతసేపు నిలువలేదు. ఫారెస్ట్ వాళ్లు రోడ్డు పనులు నిలిపివేశారు.
– పిట్ల నాగరాజు, మాజీ సర్పంచ్ ఇందిరానగర్ భరత్‌నగర్

రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి



అన్ని గ్రామాలకు తారు రోడ్డువేశారు. ఇప్పటికీ గుంతలమయమైన మట్టిరోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గ్రామంలోకి వాహనాలు వచ్చి వెళ్లేందుకు ఇబ్బంది అవుతోంది. అత్యవసర సమయంలో ఆస్పత్రికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నాం.
–ల్యాగల నరేశ్, గ్రామస్తుడు

ప్రమాదాల బారినపడుతున్నాం



మట్టిరోడ్డు కావడం, దానికి తోడు గుంతలుపడటంతో పలుసార్లు ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తిచేసి రోడ్డు పొడవునా లైటింగ్ ఏర్పాటుచేస్తే రెండు మండలాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.
– కాటు మల్లేశం, గ్రామస్తుడు

పేదల కడుపు నింపేందుకే సన్నబియ్యం



నర్సింగాపూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నాయకులు



వీర్నపల్లి: సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న నాయకులు

- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

చందుర్తి: పేదల కడుపు నింపేందుకే సీఎం రేవంత్ రెడ్డి సన్నబియ్యం పథకాన్ని అమలుచేశారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నర్సింగాపూర్‌లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. రేషన్‌కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి 6 కిలోల చొప్పున సన్న బియ్యాన్ని ప్రభుత్వంఅందిస్తుందన్నారు. పేదల కళ్లలో ఆనందం చూడడమే సీఎం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, రుద్రంగి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బొజ్జ మల్లేశం, ఐకేపీ ఏపీఎం రజిత , పంచాయతీ కార్యదర్శి కళాజ్యోతి, నాయకులు ముస్కు ముకుందరెడ్డి, గొట్టే ప్రభాకర్, భీంరాజు కనుకరాజు, పులి సత్తయ్య, కాసారపు శ్రీనివాస్‌రెడ్డి, ఎర్రం శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని రేషన్‌దుకాణంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోనితో కలిసి సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, అనర్హుల కార్డులు తొలగించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి, చుక్క రాజశేఖర్, మచ్చ శ్రీనివాస్, ఎగుర్ల ప్రశాంత్, చెన్నమనేని ప్రశాంత్, ఆసాని సత్యనారాయణ రెడ్డి, పెద్దూరి తిరుపతి, పరుశరాములు, లక్ష్మారెడ్డి, మోర కిరణ్, జలందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : మండలకేంద్రంలోని రేషన్‌షాపులో సన్న బియ్యం పథకాన్ని ఏఎంసీ చైర్మన్ రాములు, వైస్ చైర్మన్ లక్ష్మణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రారంభించారు. నాయకులు దినకర్, నిర్వాహకులు స్టాండ్లిన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలో సన్నబియ్యాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బి రాఘవరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ఐరెడ్డి మహేందర్ రెడ్డి, పసుల వెంకటి, చిట్టి ఆనంద రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎలగందుల ప్రసాద్, డైరెక్టర్లు వీరేశం, సురేందర్ రెడ్డి, అంతగిరి బాల పోచయ్య, మామిడి నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక



వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి గ్రామంలోని ఆరె క్షత్రియ కులసంక్షేమ సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిలువేణి ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా ఇటిక్యాల లింగయ్య, కార్యవర్గ సభ్యులుగా సిలువేణి లింగన్న, ఇటిక్యాల రఘుపతి, మంజేడి శ్రీనివాస్, హింగే ప్రసాద్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

హామీలు అమలు చేస్తున్నాం



మాట్లాడుతున్న దొమ్మాటి నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రేషన్‌షాపుల ద్వారా ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈనెల 14 వరకు ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గుండాటి రామ్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, డైరెక్టర్లు మెండేటి శ్రీనివాస్, చెట్‌పల్లి బాలయ్య, సూడిద రాజేందర్, నాయకులు గంట బుచ్చగౌడ్, చెన్నిబాబు, బండారపు బాల్‌రెడ్డి, పందిర్ల శ్రీనివాస్, దండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారులో చిక్కుకున్న చిన్నారి

- స్థానికుల సాయంతో బయటకు

సిరిసిల్లటౌన్: తంగళ్లపల్లి మండలం ఓబులాపూర్‌కు చెందిన విష్ణు తన రెండేళ్ల కొడుకుతో సిరిసిల్లకు కారులో వచ్చాడు. తిరుగు ప్రయాణంలో గాంధీ చౌక్‌లో రోడ్డుపక్కన కారు పార్క్ చేసి చల్ల ప్యాకెట్లు కొన్నాడు. విష్ణు కారు దిగిన కొద్ది సేపటికే ఆటోలాక్ పడింది. దీంతో అరగంటకు పైగా ప్రయత్నించి కారు గ్లాసులు కిందకు అని డోర్‌ను తెరవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



ముస్తాబాద్: మండలంలోని తుర్కపల్లిలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు మంగళవారం అందజేశారు. ఇక్కడ నాయకులు నాగరాజు, కర్రోల్ల నర్సయ్య, లింగంపల్లి విజయ్, బాలకృష్ణ, తేజ, దేవరాజు, మైసయ్య, నర్సయ్య, రాజవ్వ తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


చందుర్తి: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ... మండలంలోని బండపల్లికి చెందిన ఇద్దరు మైనర్లు ద్విచక్రవాహనంపై బండపల్లి నుంచి వేములవాడ వైపు వెళ్తున్నారు. వేములవాడ నుంచి బావుసాయిపేట వైపు వెళ్తున్న ఆటోను గ్రామ సమీపంలో ఢీకొట్టారు. ఈ ఘటనలో కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి గెంటే ప్రశాంత్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడ ఆసుపత్రికి తరలించారు.



మండే ఎండ.. గొడుగులే అండ..

గంభీరావుపేట: ఎండలు దంచికొడుతున్నాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీంతో ఇళ్లలో కూలర్లు, ఫ్యాన్లు పొద్దంతా తిరుగుతూనే ఉన్నాయి. కాగా, గంభీరావుపేట మండలకేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో మాత్రం క్రయవిక్రయదారులు ఎండకు అల్లాడుతున్నారు. మార్కెట్‌కు నీడ లేకపోవడంతో విక్రయదారులు గొడులు ఏర్పాటు చేసుకున్నారు.

వేములవాడ సమాచారం



వేములవాడ రాజన్న సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 4 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	02	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	04	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	02	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	03	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	02	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	16	560
నందీశ్వర సూట్స్	02	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	14	448
పార్వతీపురం స్పెషల్	16	672
పార్వతీపురం సాధారణ	17	336

– వేములవాడ



వేములవాడ: ఎండలు మండుతున్నాయి. వేములవాడ పట్టణంలోని 22వ వార్డు ఉప్పుగడ్డలో ఇళ్లముందు మిషన్ భగీరథ నీరు వృథాగా పోతోంది. అసలే వేసవి కావడంతో నీటి సమస్య ఉంది. అధికారులు నీరు వృథాకాకుండా చూడాలి.
– నందిపేట సుదర్శన్ యాదవ్, మాజీ ధర్మకర్త, వేములవాడ

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ సెల్‌నెంబర్: 7995002848

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

విద్యార్థుల అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న ప్రశాంత్



కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: విద్యార్థి నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తమ పాలనలో నిర్బంధాలు ఉండవని ప్రగల్బాలు పలికిన కాంగ్రెస్ సర్కారు ప్రజల మీదనే అక్రమ నిర్బంధాలకు తెరలేపిందన్నారు. విద్యార్థుల శాంతియుత నిరసన కార్యక్రమాన్ని భగ్నం చేసేలా పోలీసుల చర్యలు సరికాదన్నారు. నాయకులు శివ, సాయి, భరత్, రాహుల్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: అక్రమ అరెస్టులు అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం హెచ్‌సీయూ భూములను అమ్మి ప్రజాపాలన సాగిస్తారా అంటూ మండిపడ్డారు. నాయకులు మల్లికార్జున్, సంటి మహేశ్, కోల కిష్టస్వామి, సాయి తదితరులు ఉన్నారు.

బోయినపల్లి: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) భూములను విక్రయించవద్దని ఆందోళన చేస్తున్న ఏబీవీపీ కార్యకర్తలకు మద్దతుగా వెళ్లకుండా స్థానిక బీజేపీ నాయకులు కొనుకటి హరీశ్, మినుకుల శ్రీనివాస్‌ను మంగళవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.

యూనివర్సిటీ భూములు కాపాడాలి

హెచ్‌సీయూ భూములు వేలం వేయడం ఆపాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ పేర్కొన్నారు. భూములను ప్రభుత్వం కాపాడాలని, అరెస్టులు అక్రమమని ఖండించారు.

కోనరావుపేట: అక్రమ అరెస్టుల ద్వారా ఏమి చేయలేరని బీజేపీ మండలాధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ అన్నారు. మండలంలోని బీజేపీ, బీజేవైఎం నాయకులు బాలాజీ, చల్ల జితేందర్‌రెడ్డి, బైరగోని సురేశ్, పొన్నం మహేశ్‌ను కోనరావుపేట పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఆయన వెంట బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేశ్ గౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు చల్ల జితేందర్‌రెడ్డి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు పొన్నం మహేష్ ఉన్నారు.

ముస్తాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మవద్దని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు కోరారు. మండల కేంద్రంలో మంగళవారం మాట్లాడుతూ హెచ్‌సీయూకు చెందిన వందలాది ఎకరాలను ప్రభుత్వం అమ్మాలనుకోవడం సరికాదన్నారు.

వీర్నపల్లి: ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపెల్లి మనోజ్ కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హెచ్‌సీయూ నాలుగు వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని వేలం వేయొద్దని ప్రశ్నిస్తే ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు.

కురుమలు రాజకీయంగా ఎదగాలి



ముస్తాబాద్: యాదవ కురుమలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని యాదవ కుర్మ సంఘం మండల అధ్యక్షుడు రాగం నాగరాజు యాదవ్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం మాట్లాడారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవ కురుమలు ఎన్నిక కావాలన్నారు. అన్ని రాజకీయ పార్టీలు యాదవ కురుమలకు అవకాశాలు కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ ఎదుట నిర్మించిన దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గురువారం జరిగే ఆవిష్కరణకు భారీగా రావాలని కోరారు. తాడెపు రవి, అనిల్, ఎల్లం, బైతి నవీన్, ఎల్సాని దేవయ్య, అంజనేయులు, కోడె శ్రీను, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్ రాచర్లకోటలో దాసాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు వరుస కృష్ణహరి, వంగల వసంత్, రామ భీమేశ్వర్, ముత్యాల బాల్‌రెడ్డి, చల్ల మహేందర్, మొడుసు తిరుపతిరెడ్డి, ఇల్లందుల శ్రీనివాస్‌రెడ్డి, మిట్టపల్లి లక్ష్మీనారాయణ, బొమ్మనవేని సత్యం, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసా ఎప్పుడిస్తారు?

తంగళ్లపల్లి: సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా ఇస్తానని రైతులను ఏప్రిల్ ఫూల్స్ చేశారని బీఆర్ఎస్ నాయకుడు కడారి నవీన్ రెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ మార్చి 31లోపు రైతుభరోసా అందుతుందని సీఎం చెప్పడంతో ఎదురుచూసిన రైతులు ఏప్రిల్ 1న ఫూల్స్ అయ్యారని తెలిపారు. ఇప్పటికైనా హామీ ప్రకారం రైతు భరోసా అందించాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు తిరుపతి తదితరులున్నారు.

ఉపాధిహామీ కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు

వీర్నపల్లి: బావుసింగ్‌నాయక్ తండా పంచాయతీ పరిధిలోని చూట్ గట్టీ ఏరియాలో ఉపాధి హామీ కూలీలకు ఫస్ట్ ఎయిడ్ కిట్లను మంగళవారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి నీత, క్షేత్ర సహాయకులు అజ్మీర రాజు నాయక్, మేట్ లింబాద్రి, లింగం, తండా పెద్దలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఏరియాలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. యూనియన్ అధ్యక్షుడు భోగ శ్రీనివాస్, ఆటో యూనియన్ పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.